24న పాలెంలో విత్తన మేళా

తాండూరు రూరల్, మే 21: రైతులకు నాణ్యమైన విత్తనాలందించాలనే లక్ష్యంతో పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఈ నెల 24న విత్తన మేళా నిర్వహిస్తామని ఏఈవో శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మేళాలో నాణ్యమైన విత్తనాలను విక్రయానికి ఉంచుతామన్నారు. శుక్రవారం ఉదయం 10గంటలకు రైతులు వ్యవసాయ పరిశోధన కేంద్రానికి రావాలని, విత్తనాల కోసం 9490409163/6300820238 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. వరి కోతలు ప్రారంభమై నెల రోజులకుపైనే అవుతున్నా నిర్దేశించుకున్న లక్ష్యంలో పావు వంతు అయినా సేకరించలేదు. ఒక పక్క అకాల వర్షాలతో కేంద్రాల వద్ద కుప్పలుగా పోసిన ధాన్యం ఎక్కడ తడుస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. వానాకాలం నెత్తిమీదికొస్తున్నా రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే ధాన్యం కాంటా వేసిన రైతులకు డబ్బు చెల్లింపుల్లోనూ ఆలస్యం చేస్తున్నారు. ధాన్యం అమ్మిన వారిలో సగం మంది రైతులకు కూడా ఖాతాల్లో డబ్బు జమ చేయలేదు.

మందకొడిగా కొనుగోళ్లు

లక్ష్యానికి ఆమడ దూరంలో ధాన్యం సేకరణ

యాసంగి కొనుగోళ్ల లక్ష్యం 1.19లక్షల టన్నులు

- ఇప్పటి వరకు కొన్నది 21,178 టన్నులే
- రైతులకు చెల్లింపులూ అంతంత మాత్రమే!
- కల్లాల వద్ద రోజుల తరబడి రైతుల పడిగాపులు
- పట్టించుకోని జిల్లా పౌరసరఫరాల శాఖ

వికారాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా కొనసాగుతున్నాయి. వర్షాలు ప్రారంభం కాకముందే ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పూర్తి కావాల్సి ఉన్నా.. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. రైతులు పండించిన వడ్లను కొనుగోలు కేంద్రాలకు తరలించినా అక్కడ కొనుగోళ్లలో తీవ్ర జాప్యం అవుతోంది. సవాలక్ష కారణాలు, నిబంధనలుతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వడ్లు కాంట వేసేందుకు ఆసక్తి చూపడం లేదు. వడ్లు తెచ్చి ఎండబోసి కుప్ప చేసుకున్న రైతులు రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. విసుగెత్తిన చాలా మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణకు పెట్టుకున్న లక్ష్యంలో ఆరో వంతు మాత్రమే ఇప్పటి వరకు సేకరించారు. కోతలు మొదలై నెల గడుస్తోంది. కాలం నెత్తిమీదికి వస్తోంది. ఇంకా కల్లాల వద్దే రైతులు పడిగాపులు కాస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. చూసిచూసి రైతులు బహిరంగ మార్కెట్లలో వడ్లను అమ్ముకుంటున్నారు. కొనుగోలు కేంద్రాలతో పోలిస్తే వ్యాపారులు ప్రతీ క్వింటాలుపై రెండు మూడు వందల మేరకు తక్కువ ధరకే ధాన్యాన్ని కొంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యాన్ని చూసి రైతులు బయట విక్రయించుకునేందుకే మొగ్గు చూపుతున్నారు. యాసంగి సీజన్‌లో జిల్లాలో 1.96లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేయగా.. 1.19లక్షల టన్నుల కొనుగోలు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. జిల్లాలో ఐకేపీ సంఘాలు 33, ప్యాక్స్‌లు 63, డీసీఎంఎస్ 27, వ్యవసాయ మార్కెట్ కమిటీలు 3, ఎఫ్‌పీవోలు 3 చొప్పున కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.



ప్రస్తుతం 111 కేంద్రాల్లో కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 21,178.26 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గత నెలలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. కొనుగోళ్లు మాత్రం ఇంకా ఊపందుకోలేదు. ఐకేపీ సంఘాల ఆధ్వర్యంలో 2,075 మంది రైతుల నుంచి 9,658.08 టన్నులు, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 1,302 మంది రైతుల నుంచి 5,302.22 టన్నులు, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో 1,324 మంది రైతుల నుంచి 6,007.52 టన్నులు, ఎఫ్‌పీవో కేంద్రాల ఆధ్వర్యంలో 56 మంది రైతుల నుంచి 210.44 టన్నుల చొప్పున ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కాగా కొనుగోలు కేంద్రాలను బాగానే ప్రారంభించినప్పటికీ వాటిల్లో అనుకున్న మేర ధాన్యం కొనడం లేదు. రైతులకు కేంద్రాలపై అవగాహన కల్పించకపోవడం, వ్యవసాయ శాఖ అధికారులతో టోకెన్లు రాయించుకు రావాలనే నిబంధన, ప్రైవేట్ వ్యాపారులతో పోలిస్తే కేంద్రాల్లో ధాన్యం కొనేందుకు సవాలక్ష నిబంధనలు పెట్టడం వంటివి కూడా కొనుగోళ్లు పెరగకపోవడానికి కారణాలుగా మారుతున్నాయి.

డబ్బు చెల్లింపుల్లో జాప్యం.. రైతులకిచ్చింది రూ.4.88కోట్లు

ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంలో జాప్యం జరుగుతోంది. ధాన్యం సేకరించిన 48గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బు జమ చేయాలనే ఆదేశాలున్నా రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేసిన మొత్తం సగం డబ్బైనా రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. గత శనివారం వరకు జిల్లాలో రైతులు విక్రయించిన ధాన్యానికి రూ.46.65కోట్లు చెల్లింపులు చేయాలి. అయితే రూ.4.88కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైతులు, ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినా మిల్లుల వరకు వచ్చే సరికి జాప్యమైతుంది. అలాగే మిల్లులకు వచ్చిన ధాన్యానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలోనూ మిలర్లు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఈ అన్ని కారణాల రీత్యా రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ కావడం లేదు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయించాల్సిన జిల్లా పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తలుచుకుంటేనే ధాన్యం కొనుగోళ్లలో వేగం పెరిగి అనుకున్న లక్ష్యాన్ని చేరుతారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి మిల్లుల వద్ద పెండింగ్ లేకుండా తగిన చర్యలు తీసుకుని చెల్లింపులు త్వరితగతిన చేయాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం సేకరణ లక్ష్యం : 1.19లక్షల టన్నులు
కొనుగోలు కేంద్రాలు : 129
ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం : 21,178.26 టన్నులు
మిల్లులకు తరలించిన ధాన్యం : 19,068.76 టన్నులు
ధాన్యం విక్రయించిన రైతుల సంఖ్య : 4,757
రైతులకు చెల్లించాల్సిన ధాన్యం డబ్బులు : రూ.46,65,57,068
ఓపీఎంఎస్‌లో అప్‌లోడ్ మొత్తం : రూ. 20,73,69,271
క్లెయిమ్డ్ మొత్తం : రూ.11,63,30,737
రైతుల ఖాతాల్లో జమ చేసిన మొత్తం : రూ.4,88,01,297
రైతులకు చెల్లించాల్సిన మొత్తం : రూ.6,75,29,440

పంచాయతీల్లో పైసల్లేవ్!



మేడ్చల్ మే 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ముగియకముందు అధికారుల ఒత్తిడితో అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌లకు ఇప్పటికీ బిల్లులు అందలేదు. గతేడాది సెప్టెంబరులో చెల్లించిన పంచాయతీ ట్రాక్టర్ డీజిల్ బిల్లులు కూడా చెల్లించలేదని మాజీ సర్పంచ్‌లు వాపోతున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో ఇప్పటి వరకు నిధులు అందలేదు. అధికారులు ఖర్చుల చెల్లింపు విషయంలో చేతులెత్తేస్తున్నారు. మాకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తాత్కాలిక అవసరాలకు అప్పు చేయాల్సి వస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని ఓ పంచాయతీ కార్యదర్శి సైతం ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల పాలన గడువు ముగియగా ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వారి పర్యవేక్షణలో గ్రామాల్లో పాలన సాగుతోంది. అయితే వీరి పాలనకు ముందే పంచాయతీల ఖాతాలు ఖాళీ అయిపోయాయి. ప్రభుత్వం నిధులు అందజేయకపోవడంతో ప్రత్యేక పాలన మొక్కుబడిగా మారింది. గ్రామాల్లో ప్రజల కనీస అవసరాలు తీర్చే బాధ్యత కార్యదర్శులపై పడింది.

మూడు ఖాతాలూ ఖాళీ ...

గ్రామ పంచాయతీల్లో మూడు రకాల ఖాతాలు ఉంటాయి. ఒకటి ఆస్తి పన్నులు జమ చేసుకునే ఖాతా, గ్రామాల్లో ఆస్తి పన్ను వసూలు అంతంత మాత్రంగా జరుగడం, ఖర్చు నాలుగింతలు ఉండటంతో ఇవి ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. రెండోది ఎస్ఎఫ్‌సీ(స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) ఖాతా. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రత్యేక గ్రాంట్లు వంటివి జమ చేస్తారు. ఈ రెండు ఖాతాల్లో జమయ్యే మొత్తం ట్రెజరీ ద్వారా డ్రా చేస్తారు. మూడోది 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించినది. కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీలకు గ్రామ జనాభా ఆధారంగా నిధులు అందజేస్తుంది. ప్రతి నాలుగు నెలలకు ఓ సారి వీటిని అందజేస్తారు. ఈ నిధులు మాత్రమే పంచాయతీలకు అందుతుండగా వాటిని ప్రత్యేక సూచనల మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. స్టేట్ ఫైనాన్స్ నిధులు రెండేళ్లుగా అందడం లేదు. నిబంధనల మేరకు ఖర్చు చేయని నిధులు ఆయా ఖాతాల్లో మిగిలిపోగా మార్చిలో వీటిని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.

అప్పుల పాలవుతున్న కార్యదర్శులు

పంచాయతీల్లో ట్రాక్టర్ కిస్తీల చెల్లింపు, కార్మికుల వేతనాలు, తాగునీటి సరఫరా నిర్వహణ, పారిశుధ్యం తదితర పనుల కోసం నిధులు అందక కార్యదర్శులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సమస్యలను ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. 'మేం తాత్కాలికం. నిధులు ఎలా సమకూర్చుకోవాలో మీకే తెలియాలి. ప్రభుత్వం నుంచి నిధులొస్తే ముందు మీరే తీసుకోవచ్చు. గ్రామంలోనే ఎవరితోనైనా సర్దుబాటు చేయించండి.' అంటూ సలహా ఇచ్చి తప్పించుకుంటున్నారని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శులు ఇప్పటికే ఒక్కో పంచాయతీ నుంచి లక్ష వరకు అప్పు చేసి ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. కొన్ని పంచాయతీల్లో ఆరు నెలలుగా పారిశుధ్య నిర్వహణ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఆందోళనబాట పట్టే యోచనలో ఉన్నట్లు సమాచారం.

మరోసారి ఉగ్ర కలకలం!

- బెంగళూరు రామేశ్వరం కేఫ్ బాంబు పేలుడుకు సంబంధముందనే అనుమానం
- వికారాబాద్ శివారులో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ

వికారాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో మరోసారి ఉగ్ర కలకలం రేగింది. గత మార్చి ఒకటిన బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో చోటుచేసుకున్న బాంబు పేలుడు సంఘటనకు సంబంధం ఉందనే అనుమానంతో ఓ వ్యక్తిని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) అదుపులోకి తీసుకుంది. రామేశ్వరం కేఫ్‌లో పేలుడుకు సంబంధం ఉందని అనుమానిస్తున్న వ్యక్తి పూడూరు మండలంలోని ఓ ఫాంహౌస్‌లో ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎన్ఐఏ బృందం మంగళవారం సాయంత్రం సోదాలు నిర్వహించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మన్నేగూడ మార్కెట్‌లో మామిడి పండ్లు విక్రయిస్తుండగా ఆ వ్యక్తిని ఎన్ఐఏ అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం బెంగళూరుకు తరలించినట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో పుణే ప్రాంతానికి చెందిన ఆ వ్యక్తి నాందేడ్‌లో వ్యాపారం నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, రామేశ్వరం కేఫ్‌లో బాంబుపేలుడు సంఘటనకు సంబంధించి ఓ వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుసుకున్న జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు వికారాబాద్‌లో గల రాజీవ్ గృహకల్ప కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. కొత్తగా వచ్చే వారిపైన నిఘా ఉంచాలని, అనుమానం ఉంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దేశంలో ఎక్కడ ఉగ్రవాద కార్యకలాపాలు చోటు చేసుకున్నా.. ఏదో రకంగా వికారాబాద్ ప్రాంతం పేరు తెరపైకి వస్తున్న విషయం తెలిసిందే. పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ అనుమానితులపై నిఘా పెంచింది. మన్నేగూడలో ఓ వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారనే సమాచారం జిల్లాలో కలకలం రేపింది.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజా రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ తనిఖీలు

వికారాబాద్: ప్రజల సంరక్షణ కోసమే కాలనీల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ తనిఖీలు చేపడుతున్నామని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి వికారాబాద్‌లోని రాజీవ్ గృహకల్పలో తనిఖీలు నిర్వహించారు. కాలనీలో అనుమానాస్పదమైన వ్యక్తులు, పరిసరాలు, సరైన పత్రాలు లేని వాహనాలను తనిఖీ చేశారు. 43 ద్విచక్ర వాహనాలు, 3ఆటోలు, నాలుగు కార్లను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసమే కాలనీల్లో 'కమ్యూనిటీ కాంటాక్ట్' కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. దీంతో ఎలాంటి భయభ్రాంతులకు గురికావొద్దని, సమాజంలో కొత్తవారిపై ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని, ఏదైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సీజ్ చేసిన వాహనాల యజమానులు వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సర్టిఫికెట్లు చూపి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు నాగరాజు, రామకృష్ణ, ఆంజనేయులు, సబ్ డివిజన్ పరిధి ఐదుగురు ఎస్ఐలు, క్యూఆర్టీ సిబ్బంది మొత్తం 77 మంది పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పన పనులు

వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

పరిగి/బొంరాస్‌పేట్, మే 21: అమ్మ ఆదర్శ పాఠశాల్లో భాగంగా చేపడుతున్న పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం.01, బాలికల పాఠశాల, మండలంలోని సయ్యద్‌మల్కాపూర్ పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కింద వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలల ఆవరణలో చేపట్టిన పనులను పరిశీలించి, మొదటి ప్రాధాన్యం కింద మంచినీటి వసతి, టాయిలెట్స్ మరమ్మతులు, విద్యుత్ పనులు చేపట్టాలని సూచించారు. పనులకు మంజూరైన నిధులతో నాణ్యతగా పనులు చేయాలని సూచించారు. పాఠశాలల్లోని పనులను పర్యవేక్షిస్తూ స్కూళ్లు తెరిచే లోగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. పాఠశాలల హెచ్‌ఎంలు అత్యవసర పనులను గుర్తించి వాటిని పూర్తి చేయించాలన్నారు. సయ్యద్‌మల్కాపూర్ పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్, డీపీవో జయసుధ, తహసీల్దార్ ఆనంద్‌రావు, మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, ఎంఈవో హరిశ్చందర్, హెచ్‌ఎంలు కృష్ణారెడ్డి, గోపాల్, రుక్మిణి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే బొంరాస్‌పేట్ మండలం పూర్యానాయక్ తండా పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చేపడుతున్న పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చౌదర్‌పల్లి జెడ్పీ పాఠశాలలో విద్యుత్ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పూర్యానాయక్‌తండా పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఆయన వెంట తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో శ్రీదేవి, పంచాయతీరాజ్ డీఈ సుదర్శన్‌రావు, హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సూర్యప్రకాశ్, సి.యాదగిరి, ప్రత్యేకాధికారి రామ్‌రెడ్డి ఉన్నారు.



పరిగి జడ్పీహెచ్ఎస్ నం.01 పాఠశాలలో పనుల ప్రగతి గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులను సిద్ధం చేయాలి

పాఠశాలల పునఃప్రారంభం నాటికి ప్రభుత్వ స్కూళ విద్యార్థులకు డ్రెస్సులను సిద్ధం చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. పరిగిలో మెప్మా ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్ట శిక్షణ కేంద్రంలో స్టిచింగ్ చేస్తున్న స్కూల్ డ్రెస్సులపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు తీసుకున్న కొలతల ఆధారంగా డ్రెస్సులు కుట్టాలని సూచించారు. స్టిచింగ్‌లో నాణ్యత పాటించాలన్నారు. కలెక్టర్ వెంట కమిషనర్ వెంకటయ్య, ఎంఈవో హరిశ్చందర్, ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

అవినీతి దందా

- లంచగొండులకు అడ్డాగా మారిన ఆర్టీవో కార్యాలయం
- ఆఫీసులో బ్రోకర్లదే హల్‌చల్
- చేతివాటం లేకుంటే ఫైల్ మూలకే!
- గత్యంతరం లేక బ్రోకర్ల వద్దకు వాహనదారుల పరుగులు
- ఇష్టానుసారం కేటుగాళ్ల వసూళ్లు
- గతంలో ఏసీబీకి పట్టుబడినా ఆగని అవినీతి పర్వం



వికారాబాద్ ఆర్టీవో కార్యాలయం

వికారాబాద్, మే 21 : వికారాబాద్ ఆర్టీవో కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. అక్కడ ఏ పని కావాలన్నా చేయాల్సింది బ్రోకరే. మరి అధికారులు లేరా? అంటే ఉన్నారు! కానీ వాళ్లు ప్రజలకు ఏ పనీ నేరుగా చేయరు. లంచం తీసుకుంటున్నామనే అపవాదు వారికి రావొద్దు. బ్రోకర్ ఇచ్చే డబ్బులైతే ఏ సమస్యా ఉండదు. ఈ తతంగం ఆర్టీవో కార్యాలయంలో నిరంతరం కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. గత కలెక్టర్లు, రవాణా శాఖ ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఎవరేం చేస్తారనే ధైర్యంతో బ్రోకర్లు, అధికారులు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వసూళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఆర్టీవో కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్సు కోసం వెళ్లినా, రెన్యూవల్ చేయించాలన్నా, వాహనం ఫిట్‌నెస్ కోసం వెళ్లినా నేరుగా ఏ పనీ కాదు. అలా చేయాలంటే దానికి సవాలక్ష కారణాలను చూపి అధికారులు ఫైల్‌ను మూలకేస్తారు. కార్యాలయం చుట్టూ తిరిగి వేసాగే పౌరులు గత్యంతరం లేక బ్రోకర్లను ఆశ్రయిస్తున్నారు. సామాన్యులు నేరుగా వెళ్తే రాని అడ్డంకులు బ్రోకర్లు వెళ్లగానే చిటుక్కున పని అయిపోతున్న పరిస్థితే వికారాబాద్ ఆర్టీవో కార్యాలయంలో నిత్యం కన్పిస్తోంది. ఇక్కడ అధికారుల కన్నా బ్రోకర్లదే రాజ్యం అన్నట్టుగా ఉంది. రూ.1,000 చలానాకు రూ.3,000 వరకు వసూలు చేస్తూ అందులో కొంత కార్యాలయంలోని కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ఉన్న సిబ్బందికి అందజేస్తున్నారు.

ఒక్క రోజు రూ.లక్షల్లో బ్రోకర్ల ఆదాయం

ఆర్టీవో కార్యాలయంలో బ్రోకర్లు రాజ్యమేలుతున్నారు. ఒక్కో బ్రోకర్ ఆదాయం రోజుకు 10వేల నుంచి 30వేల వరకు ఉంటోంది. అక్కడ పదుల సంఖ్యలో బ్రోకర్లు దర్శనమిస్తారు. ఆవరణలో అడుగుపడితే అక్కడ కన్పించేది బ్రోకర్లే. అక్కడ ఒక్క రోజు బ్రోకర్ల ద్వారా వసూలయ్యే మొత్తమే లక్షల్లో ఉంటుంది. దానిలో కార్యాలయంలోని ఓ ప్రధాన(కానిస్టేబుల్) బంటు నుంచి అధికారులకు వారి వాటా ఇవ్వడం నిరంతర ప్రక్రియగా మారింది. వికారాబాద్ ఆర్టీవో కార్యాలయంలో సిబ్బంది అక్కడొకరు ఇక్కడొకరు కన్పిస్తే బ్రోకర్లు మాత్రం అడుగడుగునా ఉంటారు. ప్రాంగణం మొదలు కార్యాలయ గదుల్లోనూ వారే రాజ్యమేలుతారు. ఓ సామాన్యుడు అధికారిని కలవాలంటే గంటల తరబడి గది గుమ్మం వద్ద నిల్చోవాలి. కానీ బ్రోకరైతే దర్జాగా ఆఫీసర్ వద్దకు వెళ్లి సంతకం చేయించుకుంటాడు. గతంలో ఏసీబీ దాడుల్లో ఓ అధికారి, బ్రోకర్ పట్టుబడ్డారు. ఆ కేసు నుంచి బయటకొచ్చిన బ్రోకర్ సైతం ప్రస్తుతం ఆర్టీవో కార్యాలయంలోనే తిరుగుతున్నాడు.

జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

జిల్లాలోని తాండూరు, పరిగిలో సైతం ఇదే పరిస్థితి నెలకొందని వాహనదారులు పేర్కొంటున్నారు. బ్రోకర్లు లేనిదే ఆర్టీవో కార్యాలయాల్లో పనులు కావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 5,000వరకు లారీలుంటే తాండూరులోనే 4,500 వరకు ఉన్నాయి. పరిగి, వికారాబాద్‌లలో కలిపి 500 వరకు ఉండగా వాటి ఫిట్‌నెస్‌ల కోసం బ్రోకర్లు బాగానే వసూలు చేసి అధికారులకు ఇస్తున్నారని లారీ డ్రైవర్లు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో స్కూళ్ల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించే అధికారులు డబ్బులు తీసుకుని ఫిట్‌నెస్ లేని బస్సులకు సర్టిఫికెట్ ఇస్తారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.



వివిధ పనుల నిమిత్తం ఆర్టీవో కార్యాలయానికి వచ్చిన వాహనదారులు

చర్యలు తీసుకుంటాం

ఆర్టీవో కార్యాలయ పరిసరాల్లో బ్రోకర్లు లేకుండా చర్యలు తీసుకుంటాం. ఎవరైనా డబ్బుల డిగితే వెంటనే నా దృష్టికి తేవాలి. డబ్బిస్తేనే పని చేస్తామన్న వారిపై చర్యలుంటాయి. వాహనదారులు ఎవరైనా బ్రోకర్లను ఆశ్రయించొద్దు. డ్రైవింగ్ లైసెన్స్ ఫిట్‌నెస్ వంటివి ఏవి కావాలన్నా నేరుగా కార్యాలయ సిబ్బందినే సంప్రదించాలి. పని చేసేది అధికారులు, సిబ్బందే కానీ బ్రోకర్లు కాదు. అసలు ఆర్టీవో కార్యాలయాల్లో బ్రోకర్ వ్యవస్థను ప్రభుత్వం ఎప్పుడో నిషేధించింది.

- వెంకట్‌రెడ్డి, ఆర్టీవో, వికారాబాద్

ఇంటర్ సప్లిమెంటరీ
పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, మే 21: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎన్.శంకర్ తెలిపారు. వికారాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్స్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ మెంబెర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో మౌలిక వసతుల కల్పనతో పాటు తాగునీరు, నిరంతర విద్యుత్ సదుపాయం ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు అదేవిధంగా రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వికారాబాద్‌లో ఐదు, తాండూరులో నాలుగు, పరిగిలో నాలుగు పరీక్షా కేంద్రాలను, అదేవిధంగా నవాబుపేట్, పెద్దేముల్, మర్పల్లి, మోమిన్‌పేట్, దోమ, కొడంగల్, కులకచర్ల మండలాల్లో ఒక్కో పరీక్ష కేంద్రం చొప్పున మొత్తం 20పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కోర్సులలో కలిపి 7831 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని అన్నారు. మొదటి సంవత్సరం పరీక్ష లకు 4621మంది , రెండవ సంవత్సరం పరీక్షలకు 3210మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఆయన వివరించారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రానికి సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్ష సమయంలో మెడికల్ సిబ్బంది సరైన మందులతో అందుబాటులో ఉండాలన్నారు. పరీక్షలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు రాజమోహన్‌రావు, బుచ్చయ్య, ప్రిన్సిపాల్‌లు నర్సింహారెడ్డి, చెన్నయ్య, సురేశ్వరస్వామి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్

చెరువులో వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎదులాబాద్ మత్స్యకారులు

ఘట్‌కేసర్ రూరల్, మే 21: జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు, చర్లపల్లి పారిశ్రామికవాడ రసాయన వ్యర్థాలు చెరువులో కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎదులాబాద్ మత్స్యకారులు మంగళవారం వికారాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జవహర్‌నగర్ డంపిగ్‌యార్డుతో పాటు చర్లపల్లి పారిశ్రామికవాడ వెలువడిన రసాయనవ్యర్థాలు ఎరిమల్లేవాగు నుంచి నేరుగా ఎదులాబాద్ లక్ష్మీనారాయణచెరువులో కలిసి నీరంతా కలుషితమవుతోందని అన్నారు. ఈ చెరువుపై ఆధారపడి 700కుటుంబాలు చేపలు పట్టుకొని జీవనోపాధి సాగిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈచెరువు ఆయకట్టు కింద 2వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ వ్యర్థాలు, చర్లపల్లి పారిశ్రామికవాడ నుంచి వెలుపడే రసాయన వ్యర్థాలు చెరువులో కలవడం వల్ల సాగునీరు, తాగునీరు కలుషితమై పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. వ్యర్థాలు కలవడం వల్ల వేలసంఖ్యలో చేపలు మృత్యువాతపడి తమ కుటుంబాలు రోడ్డునపడుతున్నాయని తెలిపారు. వ్యర్థాలు కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎదులాబాద్ మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పూస యాదగిరి, కార్యదర్శి పూస నర్సింగ్‌రావు, మాజీ అధ్యక్షుడు మెంగ బాలకృష్ణ, మాజీ కార్యదర్శి పూస బాలయ్య పాల్గొన్నారు.

నెలాఖరు వరకు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ఎండీ.సత్తార్

తాండూరు రూరల్, మే 21: ప్రభుత్వ పాఠశాలల్లో నెలాఖరువరకు మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి ఎంఎ సత్తార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు మండలంలో 45ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పథకం కింద ఎంపిక చేశామన్నారు. రూ.47లక్షలతో పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందన్నారు. వీటితో ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో తాగునీరు మూత్రశాలలు, మైనర్ రిపేర్లు, విద్యుత్ సౌకర్యం వంటి పనులు గ్రామాల్లోని వీవోల ద్వారా వసూలుచేయడం జరిగిందని అన్నారు. మిగిలిన పాఠశాలల్లో ఈనెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు అట్టి పనులను పర్యవేక్షించి పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వాటికి సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు పంచాయతీ రాజ్ ఏఈకి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంపీవో రతన్‌సింగ్, ఎంఈవో వెంకటయ్య, ఉద్యానవన శాఖ అధికారి మల్లికార్జున్, హెచ్‌ఎంలు కిష్టప్ప, నర్సిరెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రభాకర్‌చారి, ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు లాలప్ప తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో డాక్టర్ మల్లు రవి

దేశంలో బీజేపీ పతనం ప్రారంభం

ఆమనగల్లు, మే 21 : దేశంలో బీజేపీ పతనం ప్రారంభమైందని, అందుకే ప్రధాని మోదీ నిరుత్సాహంతో సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ప్రజావ్యతిరేకతను గ్రహించిన మోదీ దేశంలో కుట్ర రాజకీయాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మంగళవారం ఢిల్లీ నార్త్ ఈస్ట్ పార్లమెంట్ నియోజకవర్గంలో మల్లు రవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. దేశంలో ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా తిరిగి కాంగ్రెస్‌తో కలిసి రావాలన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగానికే ప్రమాదమని మల్లు రవి పేర్కొన్నారు. కాంగ్రెస్ తోనే సామాజిక న్యాయం, సుస్థిర పాలన సాధ్యమన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభంజనం మొదలైందని, రాహుల్ నేతృత్వంలో 'ఇండియా' కూటమి అధికారంలోకి రావడం ఖాయమని మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించి ప్రజలంతా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించారని, రాష్ట్రంలో 14 లోక్‌సభ స్థానాలు కాంగ్రెస్ ఖైవసం చేసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మహ్మద్ హసన్, మాజీ ఎమ్మెల్యే చౌదరి, నాయకులు అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

చౌడాపూర్ మండల కేంద్రానికి కేజీబీవీ మంజూరు

కులకచర్ల, మే 21: మండల కేంద్రం చౌడాపూర్‌కు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం మంజూరైంది. ఈ విద్యా సంవత్సరం కొత్తగా ప్రారంభించనున్నారు. అందులో భాగంగా మంగళవారం భవనం పరిశీలన కోసం జీసీడీవో శ్రీదేవి మండల కేంద్రానికి వచ్చారు. చౌడాపూర్, మందిపాల్, మక్తవెంకటాపూర్ గ్రామంలో కేజీబీవీ పాఠశాల ఏర్పాటు కోసం భవనాలను పరిశీలించారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వానికి అద్దె భవనంలో కొనసాగిస్తామన్నారు. స్థలసేకరణ అనంతరం సొంత భవనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ నాగరాజు, ఎంఈవో హబీబ్ అహ్మద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చౌడాపూర్‌లో కేజీబీవీ ఏర్పాటుకు భవనాన్ని పరిశీలిస్తున్న జీసీడీవో శ్రీదేవి




అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న సౌమ్య

ఆయిల్‌పామ్ సాగుతో లాభదాయకం

కడ్తాల్, మే 21: ఆయిల్‌పామ్ సాగు రైతులకు అన్నివిధాలా లాభదాయకమని మండల ఉద్యానవన శాఖ అధికారి సౌమ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట సాగుకు రైతులకు అన్ని విధాలా చేయూత నందిస్తుందన్నారు. కడ్తాల మండలం మక్తమాదారం గ్రామంలో మంగళవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ఉద్యానవన శాఖ అధికారి సౌమ్య అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మక్తమాదారంతో పాటు సమీప గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఆయిల్‌పామ్ సాగు, దిగుబడి, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం గురించి అధికారులు రైతులకు వివరించి అవగాహన కల్పించారు. నీటి వసతి ఉన్న పొలాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉంటుందని సౌమ్య తెలిపారు. ఈ పంటకు చీడ, పీడల బాధకూడా తక్కువ ఉంటుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ ఎకరానికి 8 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని వివరించారు. పంటకు పెట్టుబడిగా ప్రభుత్వం మొక్కలకు 90 శాతం రాయితీ, డ్రిప్ ఇరిగేషన్‌కు 80 నుంచి 100 శాతం రాయితీ. మొక్క నాటిన నాలుగు సంవత్సరాల వరకు ఎకరాకు రూ.4,200 నిర్వహణ ఖర్చులు ఇస్తుందని సౌమ్య వివరించారు. నాలుగేళ్ల నుంచి పంట దిగుబడి మొదలై 30 సంవత్సరాల వరకు వస్తుందని తెలిపారు. వాల్యూ ఆయిల్ కంపెనీ ఏరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండలానికి ఒక ఫీల్డ్ ఆఫీసర్, మరో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించి నిరంతరం పంట పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రమేష్, ఫీల్డ్ ఆఫీసర్, హిమకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పిస్తాహౌస్ హోటల్లో పురుగుల కలకలం

» బిర్యానీలో పురుగులు కనిపించడంతో కంగుతిన్న వినియోగదారుడు



మొయినాబాద్ రూరల్, మే 21 : మండల పరిధిలోని హిమాయత్ నగర్‌లోని పిస్తాహౌస్ హోటల్లో ఆహారంలో పురుగులు ఉండటంతో వినియోగదారుడు ఖంగుతిన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పేరుకే బ్రాండ్ హోటల్ కానీ, లోపల, పరిసర ప్రాంతాలు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఆహారభద్రత పర్యవేక్షణ అధికారుల తనిఖీల లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ పరిధిలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న పిస్తాహౌస్ పేరుతో హోటల్‌ను ఏర్పాటు చేశారు. పాతబస్తీకి చెందిన మహ్మద్ ఫారూక్ తన స్నేహితులతో కలిసి వికారాబాద్ వెళ్లి తిరుగు ప్రయాణంలో భోజనం కొరకు పిస్తాహౌస్ హోటల్లో తినేందుకు బిర్యానీ ఆర్డర్ ఇచ్చాడు. సర్వర్ బిర్యానీ తీసుకువచ్చి వడ్డించాడు. ఈక్రమంలో బిర్యానీ కొంచెం తినేసరికి అందులో పురుగులు కనిపించడంతో కంగుతిన్న ఫారూక్ అక్కడ ఉన్న సిబ్బందిని నిలదీయగా పొంతన లేని సమాధానం ఇవ్వడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. పేరుకే బ్రాండ్ హోటల్ అని.. లోపల చూస్తే ఏమీలేదని, ప్రజల ఆరోగ్యంతో హోటల్ నిర్వాహకులు ఆడుకుంటున్నారని ఆరోపించారు. హోటల్‌పై చర్యలు తీసుకునేందుకు అధికారులు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. తర్వాత హోటల్‌పై ఫుడ్ సెక్యూరిటీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పి స్నేహితులతో కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగా, మండల పరిధిలో ఇటీవల కాలంలో అనేక హోటళ్లు వెలిశాయి. నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా కల్తీతో పదార్థాలతో ఆహారాలను తయారుచేసి ప్రజలకు పడ్డిస్తున్నారు. దాంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. అధికారులు కూడా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పిస్తాహౌస్, ఇతర హోటళ్లను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

'ధరణి' దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

» మే 31 వరకు పెండింగ్ సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు

» ధరణి పెండింగ్ సమస్యలపై అధికారులతో జిల్లా కలెక్టర్ శశాంక సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిశీలన క్షుణ్ణంగా చేపట్టాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా బాధ్యతగా పని చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో దరఖాస్తుల పరిశీలన, ప్రభుత్వ భూముల రక్షణపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఏవిధంగా పరిష్కరించాలి అనే విషయంపై ఆర్డీవోలు, తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడువు లోపల పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. రిపోర్టులను పరిశీలించి సంబంధిత నివేదికలతో పూర్తిస్థాయిలో కలెక్టరేట్‌కు సమర్పించాలన్నారు. మే 31వరకు పెండింగ్ సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా ప్రభుత్వ భూముల వివరాలు.. ప్రతీ తహసీల్దార్ వద్ద ఉండాలన్నారు. ధరణి దరఖాస్తులను అందుబాటులో ఉన్న రికార్డుల ద్వారా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్, మే 21 : మండల పరిధిలోని ముచ్చింతల్ స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నిర్వహిస్తున్న మగ్గం వర్క్ ఉచిత శిక్షణ శిబిరాన్ని మహిళలకు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణభారత్ ట్రస్ట్, ఇండియన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరంలో 19-45 ఏళ్ల వయస్సున్న మహిళలు ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మహిళలు మాత్రమే అర్హులు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, కల్పిస్తామని చెప్పారు. శిక్షణకు వచ్చేవారు ఆధార్, రేషన్ కార్డుతో పాటు మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని చెప్పారు. అయితే, శిక్షణకు వచ్చే మహిళలకు కనీసం చదవడం, రాయడం వచ్చి ఉండాలని సూచించారు. వివరాలకు 9391487797/9177141712/9618534720 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

దోపిడీకి ప్రైవేట్ విద్యాసంస్థలు సిద్ధం!

» తోక పేర్లు, ఫలితాలపై తప్పుడు ప్రచారాలు

» సంపాదనే ధ్యేయంగా సంస్థలు

» పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



పరిగి, మే 21: పాఠశాలలు ప్రారంభానికి సమయం దగ్గర పడుతుండటంతో ప్రైవేట్ పాఠశాలలు దోపిడీకి సిద్ధమయ్యాయి. విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షించడానికి 'ప్లే, టెక్నో, ఈ-టెక్నో, కరిక్యులమ్, ఎక్సలెన్స్, గ్లోబల్, టాలెంట్ తదితర తోకపేర్లతో ప్రచారం నిర్వహిస్తున్నాయి. నిబంధనల ప్రకారం విద్యాహక్కు చట్టానికి లోబడి ఎలాంటి తోకపేర్లు ప్రైవేట్ పాఠశాలలకు అనుమతిలేదు. అడ్మిషన్ల నిర్ణీత తేదీ తర్వాతనే ప్రవేశాలను స్వీకరించాలి. అయితే జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు ఒక అడుగు ముందుకేసి గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారాన్ని ప్రారంభించాయి. పదోతరగతి పరీక్షా ఫలితాలు ఇటీవలే వెలువడ్డాయి. పాఠశాలలు పునఃప్రారంభానికి ఇంకా 25రోజులు ఉండగానే ప్రైవేట్ బడుల ప్రచారం జోరందుకుంది. నిజానికి ఏపాఠశాల కూడా నిబంధనలు పాటించడం లేదన్నది జగమెరిగిన సత్యం. అయినా జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. సీట్లను భర్తీ చేసుకునేందుకు ప్రైవేట్ పాఠశాలలు పోటీపడుతున్నాయి. కొన్ని పాఠశాలలు అనుమతి తక్కువ తరగతులకు ఉండగా, ఎక్కువ తరగతులను నడిపిస్తున్నాయి. జిల్లాలో 120కిపైగా ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, కులకచర్ల, మోమిన్‌పేట్, మర్పల్లి, తదితర ప్రాంతాల్లో ఇవి కొనసాగుతున్నాయి. ఇటీవల వెలువడిన టెన్త్ ఫలితాల్లో పరిగిలోని కొన్ని పాఠశాలల యజమాన్యాలు తప్పుడు ప్రచారాలు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదో ఒకరిద్దరి విద్యార్థులపై బాగా దృష్టిపెట్టి పరీక్ష సమయంలో వారిపట్ల మేనేజ్ చేసుకుని వందశాతం గ్రేడింగులు వచ్చాయని తప్పుడు ప్రచారం చేసుకుంటున్నాయి. ఈ విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తప్పుడు ప్రచారాలు..

జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ఏ ఒక్కటీ ప్రభుత్వ నిబంధనలు పాటించడంలేదు. అర్హులైన ఉపాధ్యాయులు, వసతి సౌకర్యం, పరికరాలు, ఫర్నీచర్, ఆటస్థలం, గ్రంథాలయం, ప్రయోగశాలలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్వచ్ఛతవంటి వంటివి కలిగి ఉండాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి. అదేవిధంగా పోలీస్, ఫైర్, ఆర్అండ్‌బీ తదితర శాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం గుర్తించే ముందు వీటిని పూర్తిస్థాయిలో విచారణ జరిపి అన్ని అర్హతలు ఉన్నట్లు నిర్ధారిస్తే తప్ప గుర్తింపు ఇవ్వకూడదు. అయితే ఏ ఒక్క పాఠశాలకు పూర్తి అర్హతలు లేకున్నా ప్రభుత్వ గుర్తింపు మాత్రం లభిస్తోంది. ఒక్కో గదిలో రెండు, మూడు తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు ఎలాంటి చలనం లేదు. లైబ్రరీ పేరుతో పందల పుస్తకాలు ఉన్నట్లు రికార్డుల్లో ఉన్నా పాఠశాలల్లో లైబ్రరీ జాడలేకపోవడం గమనార్హం. దీన్నిబట్టి ప్రైవేట్ యాజమాన్యాలకు అధికారులు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిగి పట్టణంలోనే దాదాపుగా 20కిపైగా ప్రైవేట్ విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. అడ్మిషన్ సమయంలో అనుమతించిదని చెప్పి తల్లిదండ్రులను మభ్యపెట్టి పిల్లలను పాఠశాలల్లో చేర్పించుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై ఉన్నతాధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగునీటిని అరికట్టి చెరువులను పరిరక్షించండి

» టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

» రాష్ట్ర మున్సిపల్ కమిషనర్‌కు లేఖ

షాద్‌నగర్ అర్బన్, మే 21: ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీలోని చెరువుల్లోకి వస్తున్న షాద్‌నగర్ మున్సిపాలిటీ మురుగునీటిని అరికట్టి చెరువులను పరిరక్షించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు మంగళవారం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌కు లేఖ రాశారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ శివారులో ఉన్న లింగారెడ్డిగూడలో భూగర్భజలాన్ని పెంచి, తాగునీరు, సాగునీటిని అందిస్తున్న గుండకుంట, గురుకుంట, పోచమ్మచెరువు, పెద్దచెరువు, తుంగకుంటలకు, వాటి పాటు కాలువలకు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మరమ్మతులు చేయించి, అభివృద్ధి పర్చినట్లు తెలిపారు. అయితే, షాద్‌నగర్ మున్సిపాలిటీ మురుగునీటిని శుద్ధిచేయకుండా నేరుగా గుండకుంట మీదుగా పోచమ్మచెరువు, పెద్దచెరువు, తుంగకుంటలకు వదిలిపెడుతున్నారని తెలిపారు. గుండకుంటను ఆక్రమంగా పూడ్చివేయగా, పోచమ్మచెరువు, పెద్దచెరువు, తుంగకుంటలలో మున్సిపాలిటీ మురుగునీరు చేరడంతో నిండిపోయిందని తెలిపారు. చెరువుల్లోని నీరు తాగునీటికి, సాగునీటికి ఉపయోగపడటం లేదని, కనీసం పశువులు, పక్షులు నీరు తాగలేకపోతున్నాయని, చెరువుల్లో చేపలు సైతం పెరగడం లేదని తెలిపారు. లింగారెడ్డిగూడ గ్రామ అవసరాలకు, పర్యావరణానికి విఘాతం కల్గిస్తున్న షాద్‌నగర్ మున్సిపాలిటీ మురుగునీరు చెరువుల్లోకి రాకుండా అరికట్టాలని బక్కని నర్సింహులు లేఖలో డిమాండ్ చేశారు.



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న భూపాల్‌రెడ్డి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

» రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

» జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 21: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోళ్ల సమయంలో రైతులకు ఏమాత్రం ఇబ్బందులు కలిగించొద్దని ఆయన అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారంలో ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అలాగే రాయపోల్ గ్రామంలో ధాన్యం నిల్వలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. హమాలీల కొరత మూలంగా ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని రోజులకొద్దీ పడిగాపులు గాస్తున్నామని రైతులు వాపోయారు. అంతేగాకుండా లారీలు సమయానికి రావడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. టార్పాలిన్లను అందించే ఏర్పాట్లు చేయాలని కూడా రైతులు కోరారు. హమాలీల సంఖ్యను పెంచి వెంటనేధాన్యం కొనుగోళ్లు చేయాలని డీసీఎంఎస్, మార్కెటింగ్, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ధాన్యం తరలించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ధాన్యం నిల్వలను ఎత్తుకెళ్లడానికి లారీలు వెంట వెంటనే వచ్చేట్లు చూడాలన్నారు. వీలైనంతమేరకు ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆయనవెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి విజయలక్ష్మి, జిల్లా సహకార శాఖ అధికారి ధాత్రిదేవి, డీసీఎస్ రాథోడ్, ఏవో వరప్రసాద్‌రెడ్డి, ఏఈవోలు శ్రవణ్‌కుమార్, రాము, డీసీఎంఎస్ మేనేజర్ రాజు, రైతులు తదితరులు ఉన్నారు.

పల్లెలపై సైబర్ వల

» అమాయకత్వంతో సైబర్ నేరగాళ్ల వలలో పడిన యువకులు

» రూ.వెయ్యితో మోసం నుంచి బయటపడిన వైనం



సైబర్ నేరగాళ్ల వలలో పడిన యువకులు

బషీరాబాద్, మే 21 : రోజు ఏదో ఒకచోట సైబర్ నేరగాళ్ల మోసానికి అమాయకులు చిక్కుతున్నారు. ఒకప్పుడు పట్టణాల్లోనే వినిపించిన సైబర్ మోసాలు ఇప్పుడు పల్లెల్లోనూ చోటుచేసుకుంటున్నాయి. గ్రామీణ యువకులే లక్ష్యంగా కేటుగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనే బషీరాబాద్ మండలం వాల్యానాయక్ తండాలో బుధవారం జరిగింది. తండాకు చెందిన సిద్ధు అనే యువకుడు స్నేహితులతో కలిసి ఇటుక తయారు చేసి విక్రయిస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఓ ఫోన్‌కాల్ వచ్చింది. 'మాకు ఇటుకలు కావాలని, మంతట్టి రైల్వే స్టేషన్ వద్ద పనులు జరుగుతున్నాయి.' అని చెప్పాడు. అక్కడికి ఇటుకలు తేవాలని కోరగా.. సిద్ధు ట్రాక్టర్‌లో ఇటుక లోడ్‌తో మంగళవారం బయలుదేరాడు. ఇటుక ఆర్డర్ చేసిన నంబర్‌కు చేయగా, మా హెడ్ ఆఫీస్ నంబర్ ఇస్తా.. మాట్లాడమని సూచించాడు. సదరు నంబర్‌కు కాల్ చేయగా ఇటుక రేటు, మొత్తం ఎంత డబ్బివ్వాలని అడిగాడు. ఇటుక విలువ రూ.22,500 అని వాపోరి చెప్పాడు. అవతలి వ్యక్తి మాట్లాడుతూ.. 'మా రైల్వేలో ఇటుక డబ్బులు చెల్లించాలంటే మొదట నువ్వు రూ.22,500 మాకు పంపాలి. ఆ అమౌంట్‌తో పాటు ఇటుక డబ్బులు కూడా పంపిస్తాం.' అని చెప్పాడు. దీంతో నమ్మిన సిద్ధు తన వ్యక్తి పంపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రూ.12వేలు పంపే ప్రయత్నం చేశాడు. సాంకేతిక సమస్యరాగా, మళ్లీ రూ.వెయ్యి పంపగా డబ్బులు కట్ అయింది. మరోసారి తన వెంట ఉన్న బంధువుతో కలిసి డబ్బులు పంపే ప్రయత్నం చేయగా రూ.వెయ్యి కట్ అయ్యాయి. ఇదేదో మోసంలా ఉందని గ్రహించిన యువకులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌ను అడుగగా ఇది సైబర్ నేరగాళ్ల పనే అన్నారు. ఇలాంటి వాటిపై ప్రజలను అవగాహన కల్పిస్తున్నా అక్కడక్కడ యువకులు మోసాల బారినపడుతున్నారని అన్నారు. ప్రజలు అపరిచితులకు డబ్బు పంపొద్దని, అనుమానాస్పద ఫోన్‌కాల్స్, మెయిల్సకు స్పందించవద్దన్నారు. మోసానికి గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

గొర్రెల డీడీలు వాపసు ఇవ్వాలి

» అధికారులకు లబ్ధిదారుల దరఖాస్తులు



కొడంగల్ రూరల్, మే 21: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గొల్ల కురుమలకు ఉపాధి కల్పించేందుకు 75శాతం రాయితీతో మొదటి విడతలో గొర్రెలను పంపిణీ చేసింది. రెండో విడత పంపిణీకి అధికారులు లబ్ధిదారుల నుంచి డీడీలు కట్టించుకున్నారు. ఇందుకు లబ్ధిదారులు అధికసంఖ్యలో ప్రైవేట్‌లో అప్పులుచేసి డీడీలు చెల్లించి ఏడాది గడుస్తోంది. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, కొత్తప్రభుత్వం గొర్రెల పంపిణీపై స్పష్టత ఇవ్వకపోవడంతో తాము చెల్లించిన డీడీలను వెనక్కి తీసుకుంటున్నారు.

ఇప్పటికే 400 మంది

కొడంగల్ మండలంలో అధికారుల లెక్కల ప్రకారం గత సంవత్సరం రెండో విడతలో 75 శాతం రాయితీతో గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించగా మండలంలో 870 మంది డీడీలు చెల్లించారు. ఒక్కొక్క యూనిట్ ధర రూ.1లక్ష 75వేలు కాగా అందులో లబ్ధిదారుల వాటా రూ.43750 చెల్లిస్తే మిగతా రూ.1లక్ష 31 వేల 250 ప్రభుత్వం భరిస్తుంది. అయితే సంవత్సరం గడుస్తున్నా రెండో విడత గొర్రెల యూనిట్లు లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో తాము డీడీలు వెనక్కి తీసుకోవాలని దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇప్పటికి సగం మంది డీడీలు సంబంధిత పశువైద్యశాలల్లో అధికారులకు అందించడంతో జిల్లాస్థాయి అధికారులకు పంపించినట్లు సమాచారం.

వడ్డీ భారంతో నష్టపోయాం



నూటికి రూ.3 చొప్పున వడ్డీకి తెచ్చి డీడీలు కట్టి ఏడాది అయినా రాయితీ మాట దేవుడెరుగు.. అప్పుల అంతకంతకు పెరిగిపోతున్నాయి. ఈపరిస్థితిలో డీడీలు వాపసుతో డబ్బులు వెనక్కి తీసుకోవడం మేలనిపిస్తుంది.

అశోక్, పర్సాపూర్



చిన్నారులను సన్మానించి, అభినందిస్తున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

బెల్టుషాపులు బంద్ చేయకపోతే ఉద్యమమే

షాద్‌నగర్ అర్బన్, మే 21: ప్రతి పల్లెలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టుషాపులను నెలరోజుల్లో బంద్ చేయించకపోతే ఉద్యమిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కందివనం గ్రామంలో బెల్టుషాపులను మూయించాలని ఆ గ్రామానికి చెందిన విద్యార్థి నవీన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన ఎక్సైజ్ అధికారులు స్పందించి, బెల్టుషాపులను కట్టడి చేశారు. దాంతో మంగళవారం పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి కందివనం గ్రామానికి వెళ్లి, బెల్టుషాపులను బంద్ చేయాలని నిరసన చేపట్టిన చిన్నారులను సన్మానించి, వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ప్రతీ పల్లెలో మద్యం బెల్టుషాపులు అక్రమంగా కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. పనిబాటుకు నుంచి వందు మనిలి వరకు బెల్టుషాపులను బంద్‌చేయాలని కోరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ సైతం తాము అధికారంలోకి వస్తే బెల్టుషాపులను మూయిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. పల్లె ప్రజల జీవితాలను బెల్టుషాపులు నాశనం చేస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లోని బెల్టుషాపులను నెల రోజుల్లో మూయించకపోతే గ్రామ గ్రామాన ఉద్యమాన్ని చేపడతామని విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. బీజేపీ నాయకులు విజయభాస్కర్, ఇస్తారి శ్రీనివాస్, పసుల నర్సింహయాదవ్, బల్వంత్‌రెడ్డి, ఆకుల ప్రదీప్, లక్ష్మీకాంత్‌రెడ్డి, సుధాకర్, ఆశోక్, నరేందర్‌రెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లముందు విద్యుత్ లైన్ వేయొద్దు

» పులుసుమామిడి-పర్వతాపూర్ గ్రామస్థులు

» విద్యుత్ స్తంభాలు పాతడాన్ని అడ్డుకున్న రైతులు

కొందుర్గు, మే 21: తమ ఇళ్ల ముందరి నుంచి విద్యుత్ లైన్ వేయవద్దని మంగళవారం మండల పరిధిలోని పులుసుమామిడి-పర్వతాపూర్ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పర్వతాపూర్‌కు దగ్గరగా, మహదేవ్‌పూర్ శివారులో ఓ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారని, ఇందుకోసం రంగంపేట డ్రాహాబాద్ నుంచి చౌదరిగూడ తో మండలానికి మీదుగా, పర్వతాపూర్ రోడ్డు పక్క నుంచి విద్యుత్‌లైన్ వేస్తున్నారని వారు తెలిపారు. దీనివల్ల తమ ఇళ్ల ముందరి నుంచి, ఇండ్ల పైనుంచి విద్యుత్ లైన్ వేయడం వల్ల భవిష్యత్తులో ఇళ్ల మరమ్మతులు చేసుకోవాలన్నా, కుటుంబాలకు టెంట్లు వేసుకోవాలన్నా ఇబ్బందులు తలెత్తుతాయని పులుసుమామిడి గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. రాంచంద్రాపూర్ చౌరస్తా నుంచి పర్వతాపూర్‌లో పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలం వరకు విద్యుత్ స్తంభాలను రోడ్డు పక్కనే పాతుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పర్వతాపూర్ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై మార్చి 7న కొందుర్గు ట్రాన్స్‌కో ఏఈకి వినతి పత్రం అందజేశామని, సదరు పరిశ్రమ కాంట్రాక్టర్ విద్యుత్ స్తంభాలను పాతడంతో, ఆదే నెల 14న ట్రాన్స్‌కో షాద్‌నగర్ ఏడి మాదవరావుకు మరో వినతిపత్రం ఇచ్చామని, పనులను నిలిపి వేశామని రెండు గ్రామాల ప్రజలు తెలిపారు. మంగళవారం రోడ్డు వెంబడి విద్యుత్ స్తంభాలను పాతుతుండడంతో తాము కొన్ని విద్యుత్ స్తంభాలను తొలగించామని, పచ్చని పంట పొలాలతో ఉన్న తమ గ్రామంలో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయవద్దని కోరుతున్నారు. విద్యుత్ స్తంభాలు వేయకుండా అడ్డుకున్నవారిలో దర్శనాల దర్శనాల దర్శనం కావ మల్లేష్, డి శ్రీను, డి అంజనేయులు, భాను, ఎస్ మల్లేష్, కె శ్రీశైలం, డి మహేశ్‌లు ఉన్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి రోడ్డు వెంబడి విద్యుత్ లైన్ వేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, రెండు నెలల క్రితం ట్రాన్స్‌కో అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని పర్వతాపూర్‌కు చెందిన దర్శనం వెంకటేష్ అనే రైతు తెలిపారు. కాగా, ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రవి కుమార్ మాట్లాడుతూ రెండు నెలల క్రితం పర్వతాపూర్ గ్రామస్థులు వినతిపత్రం ఇచ్చిన వెంటనే విద్యుత్ స్తంభాలు పాతడాన్ని నిలిపివేయించాం. రైతులకు ఇబ్బందులు కలగనీయం.



పులుసుమామిడి-పర్వతాపూర్ రోడ్డు పక్కనే పాతిన స్తంభాలు



పాతిన స్తంభాన్ని తీసేయిస్తున్న పర్వతాపూర్ గ్రామస్థులు

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి


మేడ్చల్ టౌన్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


తాండూరు: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నాయకుల నివాళులు

మేడ్చల్ టౌన్, మే 21: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. రాజీవ్‌గాంధీ 33వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మేడ్చల్ పట్టణం లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహాలకు కాంగ్రెస్ నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి సంతోష్ గౌడ్, చాపరాజు తదితరులు పాల్గొన్నారు.

కీసర: రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా కీస రలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశ పురో గతికి రాజీవ్‌గాంధీ చేసిన కృషి ఎనలేనిదని కొని యాడారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సత్తి రెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, పార్టీ కీసర గ్రామశాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, చినింగని నర్సింహా, మచ్చాని జంగయ్య యాదవ్, రాజు యాదవ్, శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీటీసీలు రమేష్ గుప్తా, జంగయ్యయాదవ్, శ్రావణ్ గుప్తా, రమేష్ శర్మ, శీలం సురేష్, బాలకృష్ణారెడ్డి, జూపల్లి అశోక్ పాల్గొన్నారు.

కీసర రూరల్: మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని నాగారం, దమ్మాయిగూడ మున్సి పాలిటీ కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన దమ్మాయిగూ డలో ఆయన విగ్రహానికి, నాగారంలో చిత్రపటా నికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పిం చారు. సాంకేతిక విప్లవానికి ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయి గూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వరగంటి వెంకటేష్, కౌన్సిలర్లు గోగుల సరిత, శ్రీలత, పాండాల అను రాధ, పార్టీ అధ్యక్షుడు ముప్పు రామారావు, నాయ కులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సంద ర్భంగా ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కొంతం అంజిరెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి, గడ్డం మహేష్, సగ్గు అనిత, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, ఖయ్యూం, చిత్తారి, మల్లేష్, రవీందర్, ఫారూఖ్, వెంకటేష్, సుధాకర్‌రెడ్డి, జంగారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

పరిగి: దేశాన్ని శాస్త్రసాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లింది మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ పరిగి మండల అధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి అన్నారు. రాజీవ్ వర్ధం తిని పురస్కరించుకుని మంగళవారం పరిగిలోని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో రాజీవ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణ, అనెం అంజనేయులు., చిన్న నర్సింహులు, మల్లేశ్ తదిత రులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పి.బస్వరాజ్, అబ్దుల్ రవూఫ్, రవికుమార్, జుబేర్‌లాల, పటోళ్ల నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీలాల పాల్గొన్నారు.

యాలాల: మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్థంతి సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు అక్బర్ బాబా, గ్రామకమిటీ అధ్యక్షుడు రాపోలు నాగయ్య, ఉపాధ్యక్షులు మోహిజ్, గోనెగారి శ్రీనివాస్(చిన్న), కార్యదర్శి హైమద్, సహాయ కార్యదర్శి చందు, యూత్ కాంగ్రెస్ గౌరవాధ్యక్షుడు మారుతి, ఉపాధ్యక్షుడు శేఖర్, నర్సింహులు, ఉమేష్, నబి, రజాక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ ఎండీ.రియాజ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కె.శోభారాణి, ఉపాధ్యక్షుడు నల్ల ఎల్లారెడ్డి, కోహిర్ రవి పాల్గొన్నారు.


ఘట్‌కేసర్: రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


పెద్దేముల్: రాజీవ్‌గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


కీసర: రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు


పరిగి: ఎరువుల షాపులో అధికారుల తనిఖీ


ఫర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీ చేస్తున్న తాండూర్ సహాయ వ్యవసాయ సంచాకులు

పరిగి, మే 21: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కొడం గల్ ఏడీఏ శంకర్‌రాథోడ్, పరిగి ఏవో ప్రభాకర్‌రె డ్డిలు హెచ్చరించారు. పరిగి పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల షాపులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల విక్రయాలకు సంబంధించి రిజిస్టర్లను పరిశీలిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను ఎవరూ విక్రయించొద్దని సూచిం చారు. ధరలపట్టికను బోర్డుపై ఉంచాలని, రోజు వారీ విక్రయాల వివరాలు రిజిస్టర్లలో పెట్టాలని సూచించారు. రైతులకు ప్రతీ అమ్మకంపై తప్ప కుండా రశీదును ఇవ్వాలని సూచించారు. రైతులను ఏమాత్రం మోసాలకు గురిచేసినా లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బొంరాస్‌పేట్: రైతులు నకిలీ విత్తనాలప ట్ల అప్రమత్తంగా ఉండాలని తాండూర్ సహా య వ్యవసాయ సంచాలకులు సీహెచ్ చంద్ర మూర్తి అన్నారు. మండలంలోని పలు ఫర్టిలైజ ర్స్ దుకాణాల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు కొనుగో లు చేసే రైతులకు డీలర్లు తప్పనిసరిగా రశీదు లు అందించాలని సూచించారు. రశీదుపై పూ ర్తివివరాలు రైతుపేరు, తండ్రి పేరు, ఊరుపే రు, ధర, ఫోన్‌నెంబరు, లాట్ నెంబరు రాసి ఇ వ్వాలన్నారు. బొంరాస్‌పేట్‌లోని నిత్య ట్రేడర్స్, తుంకిమెట్లలోని డీసీఎంఎస్ దుకాణాలను తనిఖీ చేశారు. రైతులు లూజ్ విత్తనాలను కొనుగోలు చేయరాదని సూచించారు. ఎవరైనా, ఎక్కడైనా లూజ్ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏవో అనురాధ ఉన్నారు.

కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాలకు ఏఐసీటీఈ అనుమతి

- ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రవేశాలు

కొడంగల్, మే 21: కొడంగల్ నియోజకవర్గ పరిధి లోని కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కోసం అఖిల భారత సాంకేతిక విద్యామండలి అనుమతి ఇచ్చింది. దీంతో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవే శాలు చేపట్టేందుకు అవకాశం లభించింది. కోస్గిలో పాల్‌టెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళా శాలగా మార్చేందుకు ఆదివారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటశంకు ఏఐసీటీఈ సభ్య కార్య దర్శి రాజీవ్‌కుమార్ ఎక్స్‌టెన్షన్ ఆఫ్ అప్రూవల్ ను జారీ చేశారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రీకల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సుల్లో 360 సీట్లకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపా రు. వచ్చే విద్యాసంవత్సరంలో ఆయా సీట్లలో ప్రవే శాలు కల్పించొచ్చని ఈసందర్భంగా సూచించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

ఘట్‌కేసర్, మే 21: పోచారం మున్సిపాలిటీ పరిధి యంనంపేట్‌లోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో 16వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పద్మావతి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి, వేద పండితుల మంత్రోశ్చరణలతో కళ్యాణాన్ని అంగరంగ వైభంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు మున్సిపల్ పరిధితో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రెడ్యానాయక్, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్లు ధనలక్ష్మి, మెట్టు బాల్‌రెడ్డి, నాయకులు రాజేష్, నర్రి శ్రీశైలం, కాశయ్య, పాండు, దేవాలయ ఈఓ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం కూలిందని ఫిర్యాదు


రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ తదితరులు

కొడంగల్, మే 21: భారీ వర్షానికి అంగన్‌వాడీ భవనం కూ లిపోయింది. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో కొడంగ ల్ మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామంలో అంగన్‌వాడీ భవనం కూలిపోయింది. కౌన్సిలర్ రమేశ్, చందు, మోహన్ తదితరులు మంగళవారం కొడంగల్‌లో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

చినుకు పడితే చిత్తడే..!


భూలక్ష్మమ్మ చౌరస్తాలో రోడ్డుపై నిలిచిన వరద నీరు

బొంరాస్‌పేట్, మే 21: తేలికపాటి వర్షానికే మండల కేం ద్రం లోని ప్రధాన చౌరస్తాలో నీరు నిలిచి ఉండటంతో మడు గును తలపిస్తోంది. మండల కేంద్రంలోని భూలక్ష్మమ్మ చౌర స్తా మీదుగా వెళ్లే దారిలో సీసీరోడ్డు వేయడంతో ఇరువైపుల సైడ్ డ్రైనేజీ లేకపోవడంతో వర్షపునీరు నిలిచి వాహనదారు లు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పాఠశాలల్లో గడువులోపు పనులు పూర్తి చేయాలి

- డీఈవో రేణుకాదేవి


కొడంగల్ రూరల్: పాత కొడంగల్ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈవో రేణుకాదేవి


మోమిన్‌పేట్: అమ్మ ఆదర్శ పాఠశాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి చరితరెడ్డి

కొడంగల్ రూరల్, మే 21: పాఠశాలలు పునఃప్రారంబా నికి ముందే గడువులోపు పనులు పూర్తి చేయాలని వికా రాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. కొడం గల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను మంగళవారం ఆమె పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులను కనీస సౌకర్యాలతో సుంద రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. పాఠశాలల్లో తాగు నీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, విద్యుత్ పనులను నాణ్యతతో పూర్తిచేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రాంతికు మార్, మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ ప్రవీ ణ్‌కుమార్, కమిటీసభ్యులు, గ్రామస్థులు రాములు, బుగ్గయ్య, ఆంజనేయులు, వెంక టయ్య తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: అమ్మఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన మౌలిక వసతులకు సంబంధిం చిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి చరితరెడ్డి అధికారు లను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆయా పాఠశాలల్లో మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో 54 ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, విద్యుత్, పెయిం టింగ్, బెంచీలు, గ్రీన్‌చాక్ బోర్డు, మేజర్ మౌలిక వసతుల కల్పనకు చేపట్టాల్సిన పను లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయం రాజు, ప్రధానోపా ధ్యాయుడు మల్లేశం, ఉపాధ్యాయుడు గోపాల్, కంప్యూటర్ ఆపరేటర్ పద్మారావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కులకచర్ల: ముజాహిద్‌పూర్, రాంరెడ్డి పల్లి, పోటిగడ్డ తండా, మంచి కుంట తండా, సుబ్యానాయక్ తండా పాఠశాలల్లో జరుగు తున్న పనులను మండల ప్రత్యేకాధికారిణి సరళాదేవి మంగళవారం పరిశీలించారు. పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై విద్యార్థుల తల్లిదండ్రు లతో మాట్లాడారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో రామకృష్ణ, ఏపీయం శోభ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు మున్సిపాలిటీ పరిధిలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన పనులను మున్సిపాలిటీ ప్రత్యేకా ధికారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి విన య్‌కుమార్ పరిశీలించారు. పట్టణంలోని పాత తాండూరు ప్రభుత్వ హైస్కూల్ నెం-2, ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ బాలికల హైస్కూల్, గవర్నమెంట్ జూనియర్ కళాశా లలోని ఉర్దూ, తెలుగు మిడియం పాఠశా లలో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట మున్సి పల్ ఇన్‌చార్జి డీఈ ఖాజా హుస్సేన్, ఎంఈవో వెంకటయ్య, హెచ్ఎం, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి


బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడిస్తున్న ఆలయకమిటీ చైర్మన్ వేణుగోపాల్

ఘట్‌కేసర్ రూరల్, మే 21: మండలంలోని వెంకటాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను విజయ వంతం చేయాలని ఆలయకమిటీ చైర్మన్ ఉదారి వేణుగోపాల్ తెలి పారు. ఆలయ అవరణలో మంగళ వారం ఆయన ఆలయ సభ్యులతో కలిసి బ్రహ్మోత్సవాల వివరాలను వెల్లడించారు. నేటి(బుధవారం) నుంచి ఈనెల 26వరకు బ్రహ్మోత్సవాలు నిర్వ హించనున్నట్లు తెలిపారు. నేడు సాముహిక విష్ణు సహస్రనామ పారాయణం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, దీక్షాధారణ, దీక్ష సంకల్పం, రక్షాబంధన, అంకురార్పణం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం బలిహరణ, మంత్ర పుష్పం, 23న సుప్రభాత సేవ, నిత్యహోమం, బలిహరణం, స్వామివారి కల్యాణమహో త్సవం, సాయంత్రం హనుమంత సేవ, 24వ తేదీన సుప్రభాతసేవ, నిత్యహోమం, నివేదన మంత్రపుష్పం, గరుడసేవ, 25న ఉదయం రథోత్సవం, సాయంత్రం శేషవాహనసేవ, 26వ తేదీన చక్రతీర్థ, మత్రపుష్పం, సాము హిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం కార్య క్రమాలు ఉంటాయని తెలిపారు. ఆలయ ఆవరణలో చలువపందిళ్లు, తాగునీటి సౌకర్యం, వాహనాల కోసం పార్కింగ్ వంటి వసతులు కల్పించారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు నవీన్, శంకర్, లింగం, అంకన్న, రామకృష్ణారెడ్డి, కట్ట శేఖర్, మాజీ సర్పంచ్ బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు నీరుడి శ్రీనివాస్, బుర్ర వెంకటేష్‌గౌడ్, బాల్ రాజ్‌గౌడ్, సుధాకర్, ప్రభాకర్, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **పూడూరు:** ఈనెల 24న పూడూరు మండల సర్వసభ్య స మావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో మంగళవారం ఒక ప్రకటనలో పే ర్కొన్నారు. 24న మండల పరిషత్ కార్యాల యంలో ఉదయం 11గంటలకు మండల ప రిషత్ అధ్యక్షుడు మల్లేశం అధ్యక్షతన జరు గుతుందన్నారు. అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.
- **వికారాబాద్:** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఢిల్లీలో నివాసమున్న తెలుగు ప్రజలను బీజేపీకి ఓటు వేయాల్సిందిగా రాష్ట్ర కార్యవర్గ స భ్యుడు టి.సదానందరెడ్డి, వికారాబాద్ కౌన్సి లర్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యు రాలు టి.శ్రీదేవి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఢిల్లీలోని కరోల్ బాగ్, సుల్తాన్పూరి, జల్మిల్, రంగాపూ రి, గోపాల్ చారి, మహిపాల్పూరి, మయూర్ విహార్‌లో నివాసముంటున్న తెలుగు ప్రజల ను కలిసి బీజేపీకి పూర్తి మద్దతు ఇవ్వాల్సిం దిగా కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు నూనె బాలరాజు, రాష్ట్ర నాయ కులు అమరనాథ్ సారంగి, జాజుల గౌరి, కొ మ్మిడి శోభారెడ్డి, అఫ్సర్ బాషా, అజయ్ త దితరులు పాల్గొన్నారు.
- **బషీరాబాద్:** మండలంలోని నవాం ద్గీ గ్రామంలో పేదింటి వృద్ధురాలు పోశమ్మ బుధవారం ఉదయం మృతి చెందింది. విష యం తెలుసుకున్న స్థానిక యువకుడు వేణుపట్వారి తన వంతుగా వృద్ధురాలి అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశాడు.

క్రైం కార్నర్

రోడ్డు లేకుండా ప్లాట్ల విక్రయం

- రియల్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు


మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు

మేడ్చల్ టౌన్, మే 21: రోడ్డులేకుండా లేఔట్ చేసి ప్లాట్లు అమ్మిన రియల్టర్‌పై ప్లాట్లు కొన్న యజమానులు మంగళవారం మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్లాట్లు అమ్మే ముందు వెంచర్‌కు ప్రవేశ రోడ్డు ఉందంటూ నమ్మించి తమను మోసం చేశారని బాధితులు పెద్దఎత్తున మేడ్చల్ ఠాణాకు చేరుకుని మొరపెట్టుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గౌడవెల్లి గ్రామపరిధిలోని సర్వేనెంబర్ 1000, 1001లో దాదాపు ఆరు ఎకరాల స్థలంలో హరిప్రసాద్ అనే వ్యక్తి గ్రామపంచాయతీ లేఔట్ చేసి 118మందికి విక్రయించాడు. లేఔట్ స్థలం మేడ్చల్-గౌ డవెల్లి రోడ్డుకు లోపల వైపు ఉండటంతో రోడ్డు నుంచి లేఔట్‌వరకు ప్రత్యేకంగా రోడ్డు ఉందని కొనుగోలు దారులను నమ్మించాడు. దీంతో దాదాపు 118మంది ప్లాట్లను కొను గోలు చేశారు. ఈ మధ్యకాలంలో ప్లాట్లు కొన్నవారు తమ ప్లాట్ల వద్దకు రాగా లేఅవు ట్‌కు దారి ఏదని అడిగితే అదనంగా మరో రూ.2లక్షలు చెల్లిస్తే రోడ్డు ఏర్పాటు చేసి ఇస్తానని చెబుతున్నాడని, లేదంటే ప్లాట్ల వద్దకు రానివ్వమని బెదిరింపులకు పాల్ప డుతున్నాడని వాపోయారు. మోసం చేయటం తగదంటూ ప్లాట్ల యజమానులు హరిప్రసాద్‌ను కోరగా అతడు లేఔట్‌లో ప్రవేశించే రోడ్డుకు అడ్డంగా గోడకట్టి ప్లాట్ల యజమానులు రాకుండా చేశాడని బాధితులు తెలిపారు. దీనికి తోడు ఎవరైనా ఒంట రిగా ప్లాట్ల వద్దకు వస్తే వారిని బెదిరించి పంపుతున్నాడని దీంతో తమకు ప్రాణ భయం ఉందంటూ బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్లాట్ల యజమానులు హద్దు మీరితే వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయిస్తానని బెదిరిస్తున్నట్లు బాధితులు తెలి పారు. తమకు న్యాయం చేయాలంటూ ప్లాట్ల యజమానులు ఈ సందర్భంగా పోలీ సులతో మొరపెట్టుకున్నారు.

చౌదరిగూడలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమనిర్మాణాలు కూల్చివేస్తున్న అధికారులు

ఘట్‌కేసర్, మే 21: మండలంలోని చౌదరిగూడ గ్రామంలో అక్రమ నిర్మాణాలను మంగళవారం పంచాయతీ అధికారులు కూల్చివేశారు. చౌదరిగూడలోని సర్వేనెంబర్ 869లో పంచాయతీనుంచి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతుండటంతో అధికారులు నాలుగు నిర్మాణాలు అధికారులు ఎక్సవేటర్లతో కూల్చివేశారు. ఈ సంద ర్భంగా పంచాయతీ కార్యదర్శి శశికుమార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా నిర్మా ణాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ బైండోవర్

నవాబుపేట, మే 21: మండలంలోని అక్నాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్‌ను మంగళవారం బైండోవర్ చేసి తహసీల్దార్ జయరాం ముందు హాజరు పర్చినట్లు ఎస్ఐ భరత్‌భూషణ్ తెలిపారు. గ్రామంలో ఓవర్గానికి చెందిన వారిపై అసభ్యకరంగా పరుష పదజాలంతో దూషించడంతో బైండోవర్ చేసి నట్లు తెలిపారు.

ఎడ్లను కబేళాలకు తరలిస్తుండగా పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, మే 21 : అనుమతి లేకుండా ఎడ్లను కబేళాకు తరలిస్తున్న ఓవ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టుచేసి ఎడ్లను గోశాలకు తరలించారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి యంనంపేట్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎడ్లను తరలిస్తున్న అశోక్ లేల్యాండ్ వాహ నాన్ని ఆపి తనిఖీ చేశారు. మేత, నీరులేకుండా ఐదు ఎడ్లను యాదాద్రి- భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, కొండమడుగు సంత నుంచి బార్కాస్‌లోని కబేళాలకు తరలిస్తున్న డ్రైవర్ సిఫాత్ ఉర్‌రెహమాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఎడ్లను జియాగూడలోని గోశాలకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ

దోమ, మే 21: మండలంలోని మోత్కూర్ గ్రామంలో జిల్లాస్థాయి రూరల్ టెన్నిస్‌బాల్ క్రికెట్‌టోర్నమెంట్‌ను కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమేనన్నారు. ఓటమికి నాంది గెలుపు అని వ్యాఖ్యానించారు. ఓటమి చెందిన వారు అధైర్యపడకుండా పట్టుదలతో క్రీడల్లో పాల్గొనాలని తెలిపా రు. ఈ కార్యక్రమంలో లింగయ్య, మల్లేశ్, శివకుమార్, నరేశ్, కేశవులు, మహేంద ర్, క్రికెట్ అసోసియేషన్ టీం క్రీడాకారులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణను వినియోగించుకోవాలి


దోమ మండల కేంద్రంలో కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి హనుమంతరావు

దోమ, మే 21: కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా క్రీడల అధికారి హనుమంతరావు అన్నారు. మంగళ వారం దోమ మండల కేంద్రంలో కుట్టు మిషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఎంబ్రాయిడింగ్ కుట్టు మి షన్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో మహేశ్‌బాబు, ఎంఈవో హరిచందర్, మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొంరాస్‌పేట్, మే 21: బొంరాస్‌పేట్ మండలం కొత్తూర్ సబ్‌స్టేషన్ పరిధిలో కొ త్తూర్, వడిచర్ల గ్రామాల పరిధిలోని తండాలకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహంతీపూర్, జానకంపల్లి, దుప్‌చర్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అం తరాయం ఉంటుందని ఏఈ నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మతుల్లో భాగంగా సరఫరాలో అంతరాయం ఉంటుం దని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.